పరిధి

పన్నెండేళ్లు దేశమంతా తిరిగి తిరిగి మళ్లీ ఆంధ్రప్రదేశ్ చేరుకున్నాం.

ఈ పన్నెండేళ్ళలో....

మా అమ్మాయి రమ పెళ్లి అయింది.

దానికొక బాబు. మా పెద్దవాడు రఘు. బ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేరాడు. రమణ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరంలో ఉన్నాడు.

తన షష్ఠిపూర్తికి రమ్మని మరీ మరీ రాస్తే... హైదరాబాద్ వెళ్ళి వచ్చాను.

అదిగో....,

అప్పుడు మాటల మధ్యన శారద గురించి చెప్పింది- వదిన. ఆ విషయం విని నాకు నోట మాట రాలేదు.

కొంత సేపటికి తెప్పరిల్లాను. "వాళ్ళిప్పుడు ఎక్కడుంటున్నారు?"

"నీకు తెలీదు కదూ, ఇక్కడే. ఇదివరకు మీరున్న కాలనీలోనే ... రామమందిరం వీధిలో, ఇల్లు కొనుక్కున్నారు".

శారదా వాళ్ళింటికి వెళ్ళొస్తానని బయలుదేరాను.

వదిన చెప్పిన గుర్తుల్ని బట్టి ఇల్లు తేలిగ్గానే గుర్తుపట్టాను. గేటు నుంచీ వరండా క్రింది మెట్లవరకూ దారికిరువైపులా రకరకాల గులాబీ మొక్కలు, వాటికి వెనగ్గా ఒకవైపు... ఆకు కూరలు, కాకర, పొట్ల మొదలైన పాదులూ వున్నై. రెండోవైపు రంగురంగుల బంతులతో పాటు, వివిధ రకాల చేమంతులూ వున్నై. డిసెంబర్ నెల అవటం వలన కాబోలు... మొక్కలన్నీ పచ్చగా నవనవలాడుతూ విరగబూసి వున్నై. అప్పుడే నీళ్ళు పెట్టడం వలన సాయంకాలపు నీరెండ మొక్కల మీద పడి అవి వింతగా మెరుస్తున్నై.

కాంపౌండ్ వాల్‌కు బయటవైపు రోడ్డు ప్రక్కగా పద్నాలుగు పదిహేను

సంవత్సరాల పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. ఎదురింటి వాకిట్లో ఆడపిల్లలు షటిల్ ఆడుతున్నారు. ఇరుగు పొరుగు పిల్లలు పదిమందిదాకా చేరినట్లున్నారు.

నా పిల్లల చిన్నతనం గుర్తొచ్చింది. సన్నగా నవ్వుకున్నాను.

గేటు తీసికుని లోపలికి నడిచేను.

నన్ను చూసి అప్రతిభులైపోయారు శారదా, ఆమె భర్త మధు.

కుశల ప్రశ్నలు అయినై. కాఫీలు కలపటానికి వంటింట్లోకి నడిచింది శారద. నేనూ ఆమెని అనుసరించాను. నా రాకకి కారణం చెప్పాను. చిన్న చిన్న విషయాలు మాట్లాడుకున్నాం.

-హాల్లో కూర్చుని ముగ్గురం కాఫీలు త్రాగుతుండగా ఇంటిని గురించి తాము పడిన అవస్థలు చెప్పింది శారద.

ఇంతలో... సుడిగాలిలా వచ్చాడు కృష్ణ.

"డాడీ అప్పుడే వచ్చేశారా. కొత్త కేసెట్లు తెచ్చాను... చూస్తారా" తండ్రి పక్కన కూర్చుంటూ అన్నాడు. అతనికి సినిమాల పిచ్చి. ఇంట్లో వి.సి.ఆర్ వుండడంతో ఎప్పుడూ ఫ్రెండ్స్ దగ్గిర కానీ, అద్దెకు తెచ్చి అయినా కానీ వేస్తూనే వుంటాడుట.

కృష్ణ శారద రెండో కొడుకు. పెద్దవాడు దినకర్, కృష్ణ తర్వాత ఉష. ఉష తర్వాత వసంత.

కాస్సేపు సినిమాల మీద కబుర్లు సాగినై. వాతావరణం ఉత్సాహంగా మారింది.

ఒక గంట గడిచింది. నేనూ, శారదా వంట ప్రయత్నంలో పడ్డాము. హాల్లో - తండ్రీ కొడుకుల నవ్వులు వినపడుతూనే వున్నై. కూర తరగుతున్నంతసేపు కృష్ణను గురించి సణుగుతూనే వుంది శారద.

శారద వైపు పరీక్షగా చూశాను. వయస్సు తెచ్చిన శారీరకమైన మార్పుతప్ప ఆమె మనస్తత్వం ఆనాడు ఎలా వుందో ఈనాడూ అలాగే వుంది. శారద మొహంలో ఎప్పుడూ ఏదో అసంతృప్తి... చిరాకు, మాటల్లో అసహనం.

వంట పూర్తయ్యేసరికి వసంత వచ్చింది. రోజూ కాలేజీ అయిన తర్వాత అటునుంచీ అటే ట్యూషన్‌కి కూడా వెళ్ళి వస్తుందిట. మొహం అంతా వాడిపోయి వుంది.

అంతా కబుర్లలో పడ్డాం. కానీ, అందులో ఏదో వెలితి కనిపించింది నాకు. శారదతో పిల్లలు అవసరానికి తప్పని సరిగా మాట్లాడుతున్నారు. వాళ్లకు తల్లిదగ్గర చనువు లేదని గమనించాన్నేను.

"రమా వాళ్ళు ఇప్పుడెక్కడున్నారు అత్తా. ఒక బాబేనా వాళ్లకు" కృష్ణ మాటలతో సర్దుకున్నా నేను. కాస్సేపు మా మనుమడిమీదగా సాగినై కబుర్లు. తర్వాత నా కొడుకులు - రఘు, రమణల విషయాలు దొర్లినై.

"రఘు పెళ్లి చేస్తారా ఈ ఏడాది?" శారద అడిగింది.

" అనే అనుకుంటున్నాం. మంచి సంబంధం దొరికితే చెయ్యాలనే".

శారద ఏదో చెప్పబోయి, ఎవరో ఆపినట్టుగా ఆగి, మాట మార్చేసింది.

భోజనాలయినై. వసంత గదిలో పడుకున్నాను నేను.

వసంత చదువుకుంటోంది. నేను లైటు కళ్ళల్లో పడుతుందని వేరే వైపు తిరిగి కళ్ళు మూసుకున్నాను.

మనసు నిద్రపోనీయనని గతాన్ని గుర్తుకు తెచ్చింది.

నేనూ, శారదా ఎలిమెంటరీ స్కూలు నుంచీ కలిసి చదువుకున్నాం. హైస్కూలు చదువు పూర్తికాకుండానే నాకు పెళ్ళయి అత్తవారింటికి వచ్చేశాను. వెంటనే పిల్లలూ... సంసారం గొడవలతో తల మునకలయ్యేను. శారద సంగతి తెలీలేదునాకు.

తర్వాత ఎప్పుడో... శారద పెళ్ళి శుభలేఖ అందుకున్నాను. కానీ, పెళ్ళికి వెళ్లలేకపోయాను.

మా రమణ పసిపిల్లవాడప్పుడనుకుంటాను. బదిలీమీద హైదరాబాదు వచ్చాము. మేము వుండే కాలనీలో, అదేవీధి చివరి ఇంట్లో తన కొల్లీగ్ ఫామిలీతో వుంటున్నాడనీ, ఒకసారి వాళ్ళింటికి వెళ్ళి రమ్మనీ.. తరచుగా అనేవారు ఆయన. కానీ, పిల్లలతో, ఇంటిపనితో వీలు పడక చాలా రోజులు వెళ్లలేకపోయాను.

సంక్రాంతి వచ్చింది. ఇంట్లో వున్న నాలుగు బొమ్మలూ పెట్టి, పిల్లలకు భోగి పండ్లు పొయ్యాలనీ, ఆ వీధిలో ఉన్న నలుగురినీ, పేరంటానికి పిలవాలనీ అనుకున్నాను. సందు చివరి ఇంట్లో కూడా పిలవమని మా వారు మరీ మరీ చెప్పారు.

అదిగో అప్పుడు వెళ్ళాను - ఆ యింటికి. తలుపు తీసిన వ్యక్తిని చూసి నోట మాట రాక నిలబడిపోయాన్నేను. నన్ను చూసి ఆ వ్యక్తి కూడా చేష్టలుడిగిన దానిలా వుండిపోయింది.

ఆమె... శారద!

'ఇంతకాలం ఒకే వీధిలో వుంటూ' - ఎంత చిత్రం!

అప్పట్నుంచీ మా స్నేహం పెరిగింది. మగవాళ్ల మధ్య కూడా ఆత్మీయత పెరిగి నువ్వు అనుకునేదాకా వచ్చారు. పిల్లలు అత్తా అత్తా అంటూ నాతో కలిసిపోయారు.

ఒకరోజు...

నేను వాళ్ళింటికెళ్ళేసరికీ, పిల్లలమీద అరుస్తోంది శారద.

చదువుకోవడం లేదని గట్టిగా అరుస్తోంది. అలా ఒక్కసారేకాదు; చాలాసార్లు శారద పిల్లలమీద విసుక్కోవడం చూశాన్నేను.

ఆ మాటల సారాంశం అర్థమైంది నాకు. ఆమె ఆందోళనకూ, ఆవేదనకూ కారణం కూడా తెలిసింది.

శారదకు నలుగురు ఆడపడచులు. ముగ్గురు మరుదులు. వాళ్ళ మామగారు తక్కువ సంపాదన వలన - పిల్లల్ని సరిగా పోషించలేక సక్రమంగా చదువులు చెప్పించలేకపోయారు. ఇద్దరాడపిల్లలకు పెళ్ళిళ్లు చేశారు. కానీ, ఆ సంసారాలు అంతంత మాత్రమే. ఆయన పోవడంతో సంసార బాధ్యతంతా పెద్దకొడుకైన మధుమీద పడింది. అతను కష్టపడి ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశాడు కానీ, అప్పటికే వయసు దాటిపోతుండటంతో వాళ్ళు కూడ గ్రంథాలు నడిపారంటుంది శారద. తమ్ముళ్ళను చదివించాలని చూశాడు కానీ, వాళ్ళకు చదువులబ్బలేదు. ఒకతను చెప్పకుండా పారిపోయాడు. ఒకతను ఏదో కంపెనీలో ప్యూన్‌గా చేరాడు. అది కొంత నయమే. ఇంకొ అతను ఇంటర్ గట్టెక్కించలేకపోయాడు. ఊరికే తిని తిరగటం తప్ప వేరే పని జోలికి పోడు. ఇంట్లో అతని వలన వీసమెత్తు సహాయం లేదు. పైగా ఆత్మాభిమానం జాస్తి అతనికి. అందువలన ఇంట్లో రోజూ గొడవలే.

ఆడపిల్లల సంసారాలకు మధు సహాయం తప్పని సరి. పుట్టింటికి వస్తే రోజుల తరబడి ఉండిపోయేవాళ్ళు వాళ్ళు.

శారదకు తన పిల్లల మీద ' ఆ వాతావరణ ప్రభావం ఎక్కడ పడుతుందో' అనే భయం అధికమైంది. ఫలితంగా పిల్లల మీద అజమాయిషీ ఎక్కువగా ఉండేది. వాళ్ళు తన అదుపు తప్పి తిరుగుతారేమోననే భయం ఆమెది.

ఆడుకోవాలన్నా వాళ్లకి ఆమె పర్మిషన్ కావాలి. ఎంత టైమ్‌లో తిరిగి ఇంటికి చేరాలో చెప్తుంది. ఆ టైము లోపల ఇంట్లో అడుగు పెట్టకపోతే వాళ్లకు ఆపూట తిండి ఉండదు. సెలవు రోజు వస్తే వాళ్ళు ఆమెకు చాలా భయపడేవాళ్ళు. పొద్దున్నే వాళ్లకు తాను వాళ్లకోసం తయారుచేసిన పరీక్ష పేపర్లు ఇచ్చేది. అవి పూర్తి చేస్తేనే ఆరోజు వాళ్లకు భోజనం! ఒక్క క్షణం ఊరికే కూర్చున్నా, లేక ఒకళ్ళతో

ఒకళ్లు మాట్లాడినా దెబ్బలు! తను చదివి అప్పగించమన్న పాఠం అప్పగిస్తేనే టిఫిన్! ఇదీ పరిస్థితి!

ఆమె దృష్టితో చూస్తే శారద భయం సబబైనదేనేమో అనిపించినా, కొంచెం నిలకడగా ఆలోచిస్తే ఆమె భయానికి అర్థం లేదనిపించేది నాకు. శారదతో ఆమాటే అన్నాను.

“నీకు తెలీదే... అది వాళ్ళ రక్తంలోనే వుంది. ఈయన వాళ్లకోసం ఎంత కష్టపడ్డారు. అయినా వాళ్ళల్లో ఏ ఒక్కరికైనా ఆ విశ్వాసముందా? ఇప్పటిక్కూడా వేలకు వేలు పంపమని రాస్తారు. ఈయన పంపకుండా ఊరుకోలేరు. ఇంట్లో ఎంత ఇబ్బంది పడ్తున్నామో మాకే తెలుసు. వీళ్ళకేమో ఆటలూ, సరదాలూ. ఆ రంధే తప్ప చదువుదాము, పైకి వద్దాము - ఈయన కష్టం తగ్గిద్దామనే ధ్యాసే లేదు. అయినా, నా బాధే కానీ మంచి పోలికలు రావే. చెడే తొందరగా వస్తుంది. వీళ్ళేమైపోతారో ఏమో” కళ్ళనీళ్లు పెట్టుకునేది.

ఒకవేళ ఎవరైనా ఏమన్నా చెప్పబోతే, తన ధోరణి తనదేకానీ ఎదుటివారు చెప్పేది వినిపించుకునేది కాదు.

ఆడపిల్లల్ని కూడా ప్రతిక్షణం, ‘ఆడపిల్లవి అట్టా ఎగురుతావేం?, ఇల్లు చిమ్మకుండా అట్లా కూర్చుంటావేం?, ‘మగ పిల్లల్లాగా ఆడివస్తే ఎవరు చేస్తారు మీకు?’ అంటూ నసుగుతూనే వుండేది. ‘చిన్నపిల్లలు, వాళ్లకేం తెలుస్తుంది పాపం’-అనిపించేది నాకు.

పిల్లలు సవ్యంగా పెరగడానికి మార్గం ‘కట్టడి’ కాదనేది నా ఉద్దేశ్యం. అందుకని ఆటలకూ, చదువుక్కూడా తగినంత స్వేచ్ఛ ఇచ్చేదాన్ని నేను. అది చూసి నాకు పిల్లల్ని సరీగా పెంచడం చేతకాదనే విషయాన్ని తనమాటల్లోనూ, చేతల్లోనూ బయల్పరచేది శారద.

శారద పిల్లలు మా ఇంటికి వస్తే ఎంతో సరదాగా వుండేవాళ్ళు. తిరిగి

ఇంటికి వెళ్ళాలి అంటే బిక్కమొహాలు వేసేవాళ్ళు. వాళ్ళని అలాంటి పరిస్థితులలో చూస్తే నాకు జాలి వేసేది.

కానీ, ఏం చెప్పి చూసినా శారద తత్వంలో మార్పు రాలేదు.

ఇంతలోనే మా వారికి మధురకి ట్రాన్స్‌ఫరైంది.

- ఆ తర్వాత శారదని చూడటం ఇప్పుడు. మా రమ పెళ్ళికి రాలేదు శారద.

- వసంత పుస్తకాలు సర్ది, లైటు తీసింది. నేను ప్రస్తుతంలోకి వచ్చాను. పక్కకి తిరిగేను.

"నీ నిద్ర చెడగొట్టినట్లున్నాను" మంచంమీద కూర్చుంటూ అంది వసంత.

"లేదమ్మా... నేనింకా నిద్రపోలేదులే" అంటూ లేచి కూర్చున్నాను. తన చదువు విషయాలు మాట్లాడుతోంది వసంత.

"ఉషను కూడా పెద్దయ్యాక చూడలేదు" యధాలాపంగా అన్నాను - వసంత వైపు చూస్తూ...

వసంత ఉలిక్కిపడింది. కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నై. చటుక్కున తలను ఒళ్ళో పెట్టుకుంది. నాచేతిని ఊరడింపుగా వసంత తలమీద వేశాను. "ఊరుకో... పిచ్చిపిల్ల...." అంటూ భుజం తట్టాను.

చాలా సేపటికి ఉద్విగ్నత నుంచీ తేరుకుంది వసంత. చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది, "ఇలాంటి అనునయాన్నీ, ఆప్యాయతనీ అనుభవించి ఎన్నాళ్లయిందో అత్తా, మేము ఈ మాత్రమైనా ఉన్నామంటే నాన్న వల్లనే". వసంత మాటలకు తల్లడిల్లాన్నేను.

జరిగిన సంభవాలన్నీ చెప్పుకు రాసాగింది...వసంత.

"ఆ రోజు నుంచీ నామీద అమ్మ కట్టడి మరీ ఎక్కువైపోయింది. రోజూ

'నీకీ జన్మలో పెళ్లిగీత లేదని' ఏదో ఒకటి అంటూనే వుంటుంది. ఇంట్లో వుండాలంటే నరకంగా వుంది. కృష్ణకూడా చదువు మీద శ్రద్ధ తగ్గించాడు. ఫ్రెండ్సుతో తిరగడం ఎక్కువైంది. వాడసలు అమ్మ అరుపుల్ని లక్ష్యపెట్టడు".

నా మనస్సులో ఎన్నో ఆలోచనలు. అసలు లోపమంతా ఎక్కడుంది? శారద ఇంటి పరిస్థితులలోనా? ఆ పరిస్థితులను బట్టి చేసిన ఆమె ఆలోచనలలోనా లేక ఆ ఆలోచనల ప్రభావంతో చేసిన కట్టడిలోనా?

క్షణాల తర్వాత అన్నది వసంత "ఇంట్లోకన్నా బయటే బాగుంటుందని వాడు అలా తిరిగి బతకగలుకుతున్నాడు. నేనే మధ్యన నలిగిపోతున్నాను. ఇంటికి రావడం ఒక్కక్షణం ఆలస్యం అవకూడదు. ఎవ్వరితోనూ... ఆఖరికి ఆడపిల్లతోకూడా మాట్లాడకూడదు. నేను కొద్దిగానైనా మాట్లాడేది నాన్నతోనూ, చిన్నాన్నతోనే! వసంత స్వరం దుఃఖంతో పూడుకుపోయింది.

వసంత మామూలు స్థితికి రావడానికి చాలా సేపు పట్టింది. అప్పటికి నాలో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలకు కూడా ఒక రూపం వచ్చింది.

- తెల్లవారింది. కాఫీలైనై.

బయల్దేరుతుండగా శారద పసుపు కుంకుమలతోపాటు చీర, రవికెలగుడ్డ చేతికిచ్చింది. కృష్ణ ఆటో తెచ్చాడు.

" నీ పెళ్లి ప్రధానం రోజు పట్టుచీర పెడ్తాలే కోడలా" అంటూ నేను వసంత చేతిలో వందనోటు ఉంచాను. " ఆ తర్వాత ఎలాగైనా మా యింటి పెత్తనం నీకేగా" మనస్ఫూర్తిగా నవ్వుతూ అన్నాను.

వసంతతో పాటు మధూ, శారద, కృష్ణలు కూడా ఉలిక్కిపడి నావైపు చూశారు.

ఒక్క ఉదుటున దగ్గరగా వచ్చి, నాచేతిని తన చేతుల్లోకి తీసుకొని గట్టిగా నొక్కింది శారద. ఆమె కళ్లల్లో - ఎన్నెన్నో అవ్యక్త భావాలు, ఆమె స్పర్శలో

అనిర్వచనీయమైన కృతజ్ఞతా!

నేను ఆమె భుజం తట్టి, నిమ్మళంగా కదిలేను.

ఆటో ఎక్కి కూర్చున్నాను. పక్కగా నిలబడి తనలో తను అనుకుంటున్నట్టుగా పైకే అంటోంది శారద, "చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. నీ వ్యక్తిత్వం గొప్పది సుమా. ఎక్కడో ఒకరిద్దరిలో ఒకరు లాంటి దానివి నువ్వు".

ఆటో కదిలింది.

ఉష మతాంతర వివాహంతో, దినకర్ కులాంతర వివాహంతో చిన్నతనాన్నీ, బాధనీ అనుభవిస్తున్న శారద దగ్గర ఆ ప్రస్తావన తీసుకురాకపోవడమా; లేక వసంతను నా కోడలిగా చేసుకుంటాననడమా? ఏది నా వ్యక్తిత్వపు గొప్పదనం? ఏమో మరి... శారదకే తెలియాలి!

మా వారూ, మా రఘూ నా నిర్ణయాన్ని హర్షిస్తారనే నమ్మకం నన్నలా మట్లాడనిచ్చింది. వాళ్లు నా నమ్మకాన్ని మరింత పెంచారు ఆ తర్వాత.

అందుకనే, నా మనసిప్పుడు పూవుకంటే తేలిగ్గా వుంది!

***

(ఆకాశవాణి సౌజన్యంతో)